విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 21 నవంబరు 2025 8 పేజీలు

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టరు కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో గురువారం "యన్టీఆర్ వైద్య సేవలు- జిల్లా క్రమశిక్షణా కమిటీ"సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికార్లు, ప్రభుత్వ,ప్రవేటు వైద్యులుతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ప్రభుత్వ, పైవేటు హాస్పిటల్స్ పై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ సమీక్షించారు. ఐవిఆర్ యస్ కాల్స్ ద్వారా 96, గుర్తించబడిన కేసులు 22, ఇందుకు సంబంధించిన 18, హాస్పిటల్స్ వారీగా వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా

కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డాక్టరు ఎన్టీఆర్ వైద్యసేవను సక్రమంగా అమలు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నిరుపేద,మధ్యతరగతి కుటుంబాల వారు ఆపద, అత్యవసర సమయంలో వైద్యం పొందేందుకు డాక్టరు ఎన్టీఆర్ వైద్యసేవ ఆశ్రయిస్తారని తెలిపారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టరు ఎన్టీఆర్ వైద్యసేవలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గుర్తింపు పొందిన ప్రతి ▶మిగతా 2లో..

నిబంధనలు ఉల్లంఘన...

- ఇష్టారాజ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు
- చర్యలు తీసుకుంటున్నా డ్రైవర్ల తీరులో కానరాని మార్పు
- జగన్ ప్రభుత్వంలో అటకెక్కిన స్పీడ్ గన్లు

విశాలాంధ్ర- కొవ్వూరు: ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు చేస్తున్న తప్పులకు అమాయకులు బలవుతున్నారు. రవాణా శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేపడుతున్నా ట్రావెల్స్ యాజమాన్యం, డ్రైవర్ల తీరు మాత్రం మారడం లేదు. కర్నూలు ఘటన నేపథ్యంలో కూడా ట్రావెల్స్ యజమానులు మాత్రం ఎక్కడా భయపడటం లేదు. ప్రభుత్వం ఏదైనా అధికారంలో ఉన్న నాయకులు తమకు అండగా ఉన్నారన్న దీమాతో వారు రెచ్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బస్సులకు పర్మిట్ ఇచ్చినప్పుడు ఎన్ని సీట్లు, ఎన్ని స్లీపర్లు ఉన్నాయో పొందుపరుస్తున్నారు. చాలా వాటిలో వీటిని ఉల్లంఘిస్తున్నారు. డ్రైవర్ వెనుక ఉన్న జాగాని కూడా వదిలిపెట్టడం లేదు. ఒక్కో బస్సులో రెండు మూడు సీట్లు అనధికారికంగా ఆల్టర్నేషన్ చేయించుకుంటున్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా సరుకులను అనధికార కంగా రవాణా చేస్తున్నారు. ఒక్కోసారి కాసులకు కక్కుర్తి పడి ప్రమాదకర వస్తువులను లగేజీ రూపంలో అనుమతిస్తున్నారు. ఇవే ప్రమాద తీవ్రతకు కారణం అవుతున్నాయి. ఇంకా ఫైర్ అలారం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే మంటలు ఆర్పే యంత్రాలు కూడా ఉండటం లేదు. ఈ సంఘటనకు కర్నూలు ప్రమాద సంఘటన అద్దం పడుతుంది. బస్సు లగేజీ ప్లేస్‌లో వందలాది ▶మిగతా 2లో..

పాప్ కార్నిక సాగుపై రైతుల ఆసక్తి

- వేలాది ఎకరాల్లో పంట పండిస్తున్న రైతులు
- దిగుబడులు, ధర ఆశాజనకం
- ఆనందంలో రైతాంగం

విశాలాంధ్ర-లింగపాలెం: మొక్కజొన్న పంటలో పాప్ కార్నిక సాగుపై రైతులు ఆసక్తి చూపటంతో ఈపంట విస్తీర్ణం ఊహించిన విధంగా పెరిగింది. ఎనిమిదేళ్ల క్రితం కృష్ణాజిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం కాట్రేన్‌పాడు గ్రామంలో 10 ఎకరాలలో ఈపంట పండించారు. ఇప్పుడు ఈ పంట విస్తీర్ణం దాదాపు 40 వేలఎకరాలకు చేరింది. ఆంధ్రతో పాటు తెలంగాణ,చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో రైతులు పాపుకార్నికాను పండిస్తున్నారు. వంద రోజులలో ఈ పంట దిగుబడులు చేతికి రావడం పంట పండించడానికి తక్కువ పెట్టుబడి అవ్వటంతో రైతులు ఈ పంట పండించడానికి ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 25 వేల మంది రైతులు ఈ పంట పండిస్తున్నారు. ఈ పంట పండించడం వల్ల ఏడు లక్షల పని దినాలు కల్పించబడుతున్నాయి. ఏడాదికి 60 వేల టన్నుల పాప్ కార్నిక మనదేశంలో ఉత్పత్తి అవుతుంది. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.1.20లక్ష ఆదాయం వస్తుండటంతో రైతులు సంతృప్తితో ఉన్నారు. దేశంలో ఈ పంట పండించకముందు విదేశాల నుంచి ప్రతి ఏడాది 40 వేల టన్నుల పాప్ కార్నిక ఉత్పత్తి అయ్యేది. మనదేశంలో పంట పండించడం ప్రారంభించాక విదేశాల నుంచి కేవలం రెండు, మూడు వేల టన్నులు మాత్రమే దిగుమతులు అవుతున్నాయి. దీన్నిబట్టి పరిశీలిస్తే మనదేశంలో పండే ఈ పంటకు ఎంతటి ఆదరణ కలుగుతుందో ఊహించవచ్చు.

రైతుల ఆసక్తి : సీఈవో యుగంధర్

గోర్మి పాప్ కార్నికా ప్రోత్సాహంతో ఈపంట పండించడంపై రైతులలో ఆసక్తి కలిగింది. దీంతో వేలాది ఎకరాలలో పాప్ కార్నిక పండిస్తున్నారు. ఎనిమిది ఏళ్ల నుంచి పండిస్తున్న ఈ పంట వల్ల ఏ రైతుకు ఇబ్బంది రాలేదు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయటం వల్ల ▶మిగతా 2లో..

బ్యాంకర్లు రుణాలు అందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు అందజేసి వారి ఆర్థిక పురోగతికి సహాయపడాలని, గృహ, వ్యవసాయ, విద్యా రుణాలు మంజూరులో బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (బ్యాంకర్ల సమావేశం) కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఆర్‌సి కార్డుల మంజూరు, ▶మిగతా 2లో..

సజావుగా ధాన్యం సేకరణకు చర్యలు

జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్ల వద్ద విధులు నిర్వహించే కస్టోడియన్ అధికారులతో డీఆర్వో వెంకటరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులు వద్ద కస్టోడియన్ అధికారి నిర్వర్తించాల్సిన విధులు, రైతు సేవ కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యానికి ఎకనాలజీమెంట్ జారీ చేయడం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు 269 రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభించినట్టు తెలిపారు. ఈ పీపీసీలను 117 రైస్ మిల్లులకు ▶మిగతా 2లో..

ముమ్మరంగా వరి కోతలు

దిగుబడుల్లేక రైతుల దిగాలు

విశాలాంధ్ర - ఉండి : మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతలకు కూలీలకు బదులు వరి కోత యంత్రాలను వినియోగిస్తున్నారు. ఖరీఫ్ పంట రైతు నడ్డి విరిచింది. గోరుచుట్టుపై రోకటి పోటు చందంగా అక్టోబర్‌లో సంభవించిన మొంథా తుపాను రైతుల కలలను ఆవిరి చేసింది. కనీసం పెట్టుబడులు రాని దుస్థితిలోకి నెట్టేసింది. పంట చేతికొస్తుందన్న దశలో తుఫాను రైతుల కలలు ఆవిరి చేసింది. తుఫాను కారణంగా సంకు రాలి తప్ప, మాను పండుగా గింజ తయారయ్యింది.గింజ పూర్తిగా పాలు పోసుకోకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతల సమయంలో దాని ప్రభావం రైతులపై తీవ్రంగా పడింది. ఎకరాకు కనీసం 10 నుండి 12 బస్తాల వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన, ఆందోళన చెందుతున్నారు.పెట్టుబడులు తడిసి మోపెడైన కారణంగా తాము తమ కుటుంబ సభ్యులు చేసిన కష్టం పోయినా కనీసం పెట్టుబడులు రావని రైతులు వాపోతున్నారు.ప్రస్తుత పరిస్థితులు పంట దిగుబడి 20 నుండి 25 బస్తాలు అవటం గగనం అవుతుందని వాపోతున్నారు. పెట్టుబడులు మాత్రం ఎకరాకు రూ.30 నుండి 35వేలు అయ్యాయని చెప్తున్నారు.కౌలు రైతులయితే కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఎకరాకు 15 బస్తాలు మగతా ఇవ్వాలా... పెట్టిన పెట్టుబడి ఎలా తీర్చాలా అంటూ లబోదిబోమంటున్నారు. గతంలో ఎకరాకు వరి కోత మిషన్‌కు నాలుగైదు డబ్బాలు అయ్యేవని నేడు మూడు డబ్బాలు అవడం గగనం

అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాతావరణం రైతును ఠారెత్తిస్తోంది. పంట చేతికందే సమయంలో వాతావరణం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. మండలంలో 19 గ్రామాలు ఉండగా ఆయా గ్రామాల్లో 10,815 ఎకరాలు వరి సాగు అవుతుంది. ఇంత పెద్ద మొత్తంలో వరి సాగు అవుతున్నా వ్యవసాయ అధికారులు మొంథా తుఫాను కారణంగా 360 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని కాకి లెక్కలు నివేదికల ద్వారా పంపటం రైతు వెన్నుపూస విరచటమేనని రైతు సోదరులు వాపోతున్నారు. పైకి వరి నిటారుగా ఉన్నప్పటికీ తప్పా తాలు మానిపండు ఎంత నష్టం కలిగిస్తుందో వ్యవసాయ అధికారులకు కనిపించట్లేదా అని ప్రశ్నిస్తున్నారు. దిగుబడిని బట్టి రైతులను ఆదుకోవాలని,రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు రైతు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇన్ఫోసిస్‌కు ఇద్దరు డిఎన్నార్ విద్యార్థినుల ఎంపిక

విశాలాంధ్ర -భీమవరం: ప్రముఖ గ్లోబల్ ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ కు ఇద్దరు డి.ఎన్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో

ప్లేసుమెంటు కు ఎంపికైన అత్తిలి లక్ష్మి చేతన, పట్టాపు శ్రావణి నాగ మహాలక్ష్మిలను కళాశాల అధ్యక్షుడు జి.వి. నరసింహరాజు,సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగ రాజు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజాన్ కుమార్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.రామ్ కిశోర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

విశాలాంధ్ర- ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొం దించు కోవాలని ఎంపీడీవో మనోజ్ అన్నారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాల

యంలో వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యత వివరించారు. అనం తరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బీజేపీ మహిళా కన్వీనర్ మాలతి రాణి, గ్రంథాలయ అధికారి శ్రీదేవి, గ్రామ ఉపసర్పంచ్ పాతూరి జగదీష్, పంచాయతీ కార్యదర్శి బొడ్డు వెంకట రవిచంద్ర కుమార్, భీమేశ్వర దేవస్థానం చైర్మన్ హనుమంతరావు, తిప్పాని రాంబాబు, కాళ్ల సోమశేఖర్, రజిని బాబు, ఉపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర- ఉంగుటూరు : చెత్త నుంచి సంపదపే సృష్టించ వచ్చునని ఉంగు టూరు డిప్యూటీ ఎంపీడీవో గెడ్డం రమేష్ బాబు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం బాదం

పూడిలో ఆయన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించారు. వ్యర్థాలను రోడ్డుపై పడవేయకుండా ఇంటికి వచ్చే పారిశుద్ధ్య వాప ానంలో వేయాలన్నారు. కార్యక్రమంలో బాదంపూడి పంచాయతీ కార్యదర్శి కె.వి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు రూ.106.23 కోట్లు

విశాలాంధ్ర - చింతలపూడి రూరల్: జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం ఇంద 16098 మందికి 106.23 కోట్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందని తెలుగు రైతు ఏలూరు జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు కొనియాడారు. అన్నదాత సుఖీభవ పథకం విడుదలైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇవ్వడమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం పని చేయడమే చంద్రబాబు ప్రత్యేకత అన్నారు. జిల్లాలో అత్యధికంగా చింతలపూడి నియోజకవర్గంలో 36,818 మంది రైతులకు, నూజివీడు నియోజకవర్గంలో 35529 మందికి, పోలవరంలో 34037 మందికి, దెందులూరు 19950 మందికి, ఉంగుటూరు 13910 మందికి, కైకలూరు 8911 మందికి, గోపాలపురం 9651 మందికి, ఏలూరు 2,162 మంది రైతులకు అన్న మాట ప్రకారం బ్యాంకు ఖాతాలో జమచేసి మాట నిలబెట్టుకుంటున్నారని కొనియాడారు.

సేకరణకు చర్యలు (1వ పేజీ తరువాయి)

అనుసంధానం చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. కస్టోడియన్ అధికారులు రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యం వాహనాలను నిర్ణీత సమయంలో లోడు ఖాళీ చేసి రైస్ మిల్లుల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం. దేవులా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ రాజు, డీఎస్టీటీలు, కస్టోడియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు అందించాలి (1వ పేజీ తరువాయి)

పశు కిసాన్, ఎస్ హెచ్ జి, ఎంసిపి, పిఎం స్వనిధి, పిఎం ఈజిపి, వీవర్స్ ముద్ర యోజన, పీఎం విశ్వకర్మ, సూర్యాఘర్, విద్యా రుణాలు తదితర అంశాల ప్రగతిపై కలెక్టర్ బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించడంలో చిన్న బ్యాంకుల కన్నా పెద్ద బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించడం పై రీజినల్ మేనేజర్ శ్రీదేవిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. వీవర్స్ ముద్రా రుణాలు మంజూరులో బ్యాంకర్లు శ్రద్ధ చూపాలన్నారు. డ్వాక్రా రుణాలు జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రుణాలు మంజూరులో బ్యాంకులు శ్రద్ధ చూపడంలేదన్నారు. చిన్న వ్యాపారులకు సరళతరంగా రుణాలు అందజేస్తే ఎన్నో కుటుంబాలు బాగుపడతాయన్నారు. అనంతరం 2024 - 25 మెప్మా "అవని" వార్షిక సంచిక ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పులపర్తి రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ వి.సత్యనారాయణ, నాబార్డ్ డిడి నిష్యంత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వహిస్తే చర్యలు (1వ పేజీ తరువాయి)

హాస్పటల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నగదు రహిత సేవలు అందరికీ అర్థమయ్యే రీతిలో ఫ్లెక్సీ బోర్డులు పెట్టాలని, వచ్చిన పేషెంటుకు స్నేహభావంతో అర్థమయ్యే రీతిలో చక్కగా వివరించాలని అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద ఓపి కేసులు నమోదు చేసుకున్న వారికి నగదు రహిత సేవలు అందించబడతాయని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని అన్నారు.రోగి డిశ్చార్జ్ అయిన తర్వాత మందులు,రవాణా ఛార్జీలు అందించాలని అన్నారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులలో సిసి కెమెరాలను నిర్వహించాలని, ఏదైనా అంతరాయం ఏర్పడితే సకాలంలో సరిచెయ్యాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జె.అమృతం,డిసిహెచ్ యస్ డాక్టర్ బి.పాల్ సతీష్ కుమార్, ఎన్టీఆర్ వైద్యశ్రీ కో.ఆర్డినేటరు డాక్టర్ ఐ.రాజీవ్, ప్రధాన ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంటు డాక్టర్ యం.యస్.రాజు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ వైద్యాధికారులు, ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్లు రాజ, భారతి,శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘన (1వ పేజీ తరువాయి)

కొత్త సెల్ ఫోన్లు ఉంచడం వల్ల ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి రోజు 30 ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ వెళుతున్నట్లు తెలుస్తోంది. సీజన్ బట్టి వీటి సంఖ్య కూడా మారుతుంటుంది. దాదాపు ఈ బస్సులన్నీ స్టేజ్ క్యారియర్లు గానే తిరుగుతున్నాయి. పండుగ సమయాల్లో ఎక్కువమంది ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. డిమాండ్ ఉండడంతో ట్రావెల్స్ యాజమాన్యం ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. గత నాలుగు నెలల కాలంలో రవాణా శాఖ అధికారులు 200 పైగా ఈ బస్సులపై కేసులు నమోదు చేసినా వారి తీరు మాత్రం మారడం లేదు. అధికారులు, ఇన్స్పెక్టర్లు వివిధ బృందాలుగా ఏర్పడి హైవేలపై రాత్రి సమయంలో తనిఖీలు చేస్తున్నారు. సీట్ల ఆల్టర్నేషన్, సరుకుల రవాణా, డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు వంటివి పరిశీలన చేస్తున్నారు. వేగంతో వెళ్లే బస్సుల్లో బరువైన వస్తువులను వేస్తే అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా మితిమీరిన లోడ్ వేసేస్తున్నారు. ఇలాంటి వాహనాలను తరచూ అధికారులు సీజ్ చేస్తున్నా యాజమాన్యం చేస్తున్న తప్పులకు అంతేలేకుండా పోయింది. కాంట్రాక్ట్ క్యారేజీకి అనుమతి ఉన్న బస్సులు వ్యక్తిగతంగా ప్రయా ణం చేయకూడదు. కేవలం గుత్తగానే మాట్లాడుకుని తిప్పాలి. కానీ టికెట్లను భారీగా వసూలు చేస్తూ వీటిని రోడ్లపై పరిగెత్తిస్తున్నారు.

అతివేగం.. మితిమీరిన భారం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తీరు ఇలా ఉంటే.. టిప్పర్లు, కంకర లారీల పరిస్థితి మరోలా ఉంది. ఈ వాహనాలు మితిమీరిన వేగంతో రావడం అదుపు చేసుకోకపోవడం తోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రహదారులు కూడా ఛిద్రం అవుతున్నాయి. జిల్లాలో ఇసుక, కంకర,మెటల్, వంటి వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం మండలాలతో పాటు పలు మండలాలలో క్వారీలు, క్రషర్లు అధికంగా ఉండడంతో పరిమితులు మించిన లోడుతో ప్రయాణిస్తున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనలు ప్రకారం 12 టైర్ల లారీల్లో 20 టన్నులు, పది టైర్ల లారీల్లో 16 టన్నులు, లోడు చేసుకోవచ్చు కానీ డబ్బు ఆశతో వాహనదారులు పరిమితికి మించి లోడ్ చేస్తున్నారు. 20 టన్నులు సామర్థ్యం గల లారీ 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో మాత్రమే పయనించాలి. కానీ 40 టన్నులకు పైగా వేసుకుని 50 కిలోమీటర్లకు తగ్గకుండా నడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలపై ఎప్పటికప్పుడు రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నా డ్రైవర్ల తీరులో మార్పు కనిపించడం లేదు. అందువల్ల రవాణా శాఖ అధికారులు మరింత కఠినంగా వ్యవహరించివారి లైసెన్సులు రద్దు చేయడమే గాక మరిన్ని చర్యలు పలువురు కోరుతున్నారు.

జగన్ ప్రభుత్వంలో అటకెక్కిన స్పీడ్ గన్లు..

మితిమీరిన వేగంతో నడిచే వాహనాలను గుర్తించడానికి రవాణా శాఖ అధికారులు గతంలో స్పీడ్ గన్లుతో జాతీయ రహదారిపై తనిఖీలు చేసేవారు. నిబంధనల కన్నా ఎక్కువ వేగం ఉన్నట్లు గమనిస్తే అక్కడికక్కడే ఆపి జరిమానా విధించేవారు. జగన్ ప్రభుత్వ హయాంలో దీనిపై దృష్టి సారించలేదు. దాని ఫలితంగా ఇప్పుడు స్పీడ్ గన్లతో తనిఖీలు ఆపేసారు. దీంతో ఎంత వేగంగా వెళుతున్నా గుర్తించే వీలు ఉండటం లేదు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా రహదారిపై వాహన తనిఖీలు పూర్తి స్థాయిలో చేయాలని నిపుణులు కోరుతున్నారు.

ఆసక్తి (1వ పేజీ తరువాయి)

పంట దిగుబడులలో మంచి ఫలితాలు రావటం రైతులకు ఎటువంటి నష్టం కలుగటం లేదు. ప్రకృతి వల్ల నష్టాలు వస్తే కంపెనీ నష్టాన్ని రైతులకు అందజేస్తుంది. దీనివల్ల రైతులకు ప్రయోజనంగా ఉంది. ప్రతి ఏడాది డిసెంబర్ 15 లోపు ఈ పంటను వేయాలి. దీనివల్ల అధిక దిగుబడులు వస్తాయి. ఎకరాకు మూడున్నర టన్నుల నుంచి ఆరు టన్నుల మేర దిగుబడి వస్తుంది. రైతులకు కంపెనీ ముందుగానే ధర నిర్ణయించడంతో ఆ ధరకే కొనుగోళ్లు జరుగుతున్నాయి.ఈ పంట పండించే రైతులకు కలిగే ప్రయోజనాలను గమనించిన ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు ఈ పంట పండించడానికి ముందుకు రావడంతో మన దేశంలో పాపు కార్నిక పంట విస్తీర్ణం పెరిగి రైతులకు ఆశాజనకంగా ఉంది.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర - కామవరపుకోట: నేటి గ్రంథాలయాలే ఆధునిక దేవాలయాలని ఏపీ ప్రజానాట్యమండలి నాయకులు, జానపద కళాకారుడు టీవీఎస్ రాజు అన్నారు. గురువారం కామ వరపుకోటలో 58వ గ్రంథాలయ వారో త్సవాల ముగింపు సభకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం అధ్యక్షత

వహించారు. సభలో ప్రజా వైద్యశాల డాక్టర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయం లోని విలువైన సాహిత్యాన్ని చదవడం ద్వారా చైతన్యవంతులు కావాలని కోరారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరి రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సభ ప్రారంభంలో సీనియర్ జానపద కళాకా రులు చిలుకూరి సుబ్బయ్య చారి వీరమల్ల సత్యనారాయణ ప్రార్థనాగీతంతో సభను ప్రారంభించారు. ఈ సభలో సీనియర్ జానపద కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, చిలుకూరి సుబ్బయ్య చారి, టీవీఎస్ రాజులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సభలో ఆతిథ్య విద్యా సంస్థ ప్రిన్సిపల్ ప్రభాకర్, తపస్య కళాశాల ప్రిన్సిపల్ అనిల్ పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాధికారి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

విశాలాంధ్ర-ఏలూరు: చాటపర్రు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ, అక్షరాస్యత దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథు లుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి పి. శ్రీనివాసవర్మ, దొడ్డపనేని రాధాకృష్ణ, రిటైర్డ్ లైబ్రేరియన్, సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఒ.సుబ్బారావు, విశ్రాంత ప్రధానోపాధ్యా యులు,



బి.కె.యం.యు. మండల కార్యదర్శి పొటేలు పెంటయ్య, బి.సత్యవాణి ప్రిన్సిపాల్ లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గ్రామ పెద్దలు కిలారి శ్రీనాథ్, పాతూరి నాని పాల్గొన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, డిబేట్, పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర - పాలకోడేరు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు శాఖా గ్రంథాల యంలో గ్రంథాలయ అధికారి కె. బాలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలలో నిర్వహిం చిన పోటీలలో గెలు పొందిన విద్యార్థిని

విద్యార్థులకు గురువారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈఓ పెను మత్స వెంకట శివ నాగరాజు, గొల్లలకోడేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి.పాల్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి. సూర్యనారాయణ రాజు బహు మతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో మనిషిని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్ళేది ఒక్క చదువు మాత్రమేనన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయడమే అని తెలిపారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యానికి సాయం

విశాలాంధ్ర -భీమవరం: కడుపులో కణితితో బాధపడుతున్న జంగారెడ్డిగూడెం కు చెందిన కావేటి కోటలక్ష్మి వైద్యం నిమిత్తం కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు పది హేను వేల రూపాయలను భీమవరంలో ఆమె కుటుంబ సభ్యులకు అంద చేశారు. ఈ సంద ర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట

సీతారామలక్ష్మి గంటా త్రిమూర్తులు అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము, కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, భీమవరం మండల అధ్యక్షులు కొయ్యలగడ్డ లక్ష్మి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి - సీపీఐ

విశాలాంధ్ర -నూజివీడు : మండలంలోని తుక్కులూరు గ్రామ శివారు దంతులవారిగూడెం ప్రజలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ నూజివీడుకు కూత వేటు దూరంలో ఉన్న దంతులవారిగూడెం ప్రజలకు కనీస సౌకర్యాలైన రోడ్డు, డ్రైనేజీ, వీధిలైట్లు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలకులకు పేదల ఓట్లు కావాలే తప్ప పేదల ఇబ్బందులు పట్టడంలేదని విమర్శించారు. తుక్కులూరు - దంతులవారిగూడెం రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక మంత్రి ఆదేశించినా స్థానిక నాయకులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఆ రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టి అక్కడి ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని నూజివీడు ఎంపిడిఓ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ లోన్ బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడి ఎస్సీ కార్పొరేషన్ లోన్ బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడి ముక్కంటి అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలో ఎస్సీ కార్పొరేషన్‌లో తీసుకుని బకాయి ఉన్నవారితో ఆయన చర్చించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మండలంలో 50 మంది ఎస్సీ కార్పొరేషన్ లోన్లు తీసుకుని బకాయి ఉన్నారని అధికారుల ఆదేశాల మేరకు వాటిని రికవరీ చేయనున్నట్టు తెలిపారు. బకాయి ఉన్నవారు వన్ టైం సెటిల్మెంట్‌తో కూడా బకాయి చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె.సుగుణరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాసరావు, డిఇఒ ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలి పశు వైద్యశాలలో రికార్డుల తనిఖీ

విశాలాంధ్ర - దెందులూరు: పాడి రైతుల అభివృద్ధి సంక్షేమానికి పశు సంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, పథకాలను రైతులకు తెలియపరిచి గ్రామ గ్రామాన పశు

వైద్య శాఖ వైద్య శిబిరాలను నిర్వహించాలని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు బి. ప్రసాద్ రావు అన్నారు. గురువారం దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలోని మండల పరిషత్ శాఖ అధికారి కార్యాలయాన్ని ఏలూరు జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. దెందులూరు పశువైద్య శాఖ అధికారి డాక్టర్ హరికృష్ణకు జెడి పలు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

విశాలాంధ్ర- పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలును పాల కోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని దళారులకు కాకుండా నేరుగా ప్రభుత్వానికి విక్రయించాలని, తుఫాను ప్రభావం వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు మేలు చేసే విధంగా

కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోపు రైతుల ఖాతాలోనికి ప్రభుత్వం డబ్బులు జమ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో నరసింహారాజు, మోగల్లు నీటి సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ రాజు, గ్రామ టీడీపీ అధ్యక్షులు శంకరుడు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలి

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అలవర్చుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి , రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ముదినేపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన అన్నదాత సుఖీభవ పథకం 2వ విడత జిల్లాలో 106.23 కోట్లు రైతుల ఖాతాల్లో సొమ్మును జమ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కులాల వారీగా పక్షపాత ధోరణితో వ్యవహరించగా వాస్తవ లబ్ధిదారులు నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇందుకు భిన్నంగా అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం వర్తింపజేస్తున్నట్టు తెలిపారు. గత అనుభవాల కంటే వ్యవసాయంలో కొత్త విధానాలు అవలంబించి జిల్లా 5వ స్థానంలో నిలిచిందన్నారు. గత ప్రభుత్వంలో 29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే నేడు 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.12,800 కోట్లు రైతులకు జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రి సెల్వి, ఆర్డీవో అచ్యుత అంబరీష్, వ్యవసాయ జెడి హబీబ్ భాష, తహసీల్దార్ ఎస్.కె లతీఫ్ పాషా, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఏడిఏ జి. వెంకట మణి, ఏవోలు ,మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్‌రావు, మంత్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జెసి తన ఛాంబర్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోలు, పి జి ఆర్ ఎస్ పెండింగ్ ఫిర్యాదులు ప్రగతి, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్, అర్హులైన వారికి అందరికీ ఇల్లు, రీ సర్వేకు సంబంధించి వెబ్ ల్యాండ్ లో చేయవలసిన సవరణలు తదితర అంశాలపై రెవిన్యూ, సివిల్ సప్లయ్, వ్యవసాయ, సహకార, సర్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వారం రోజుల్లో జిల్లాలో అన్ని మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా జరగనున్న నేపథ్యంలో ఖరీఫ్ 2025-26 సీజన్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని పరికరాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు అవసరమైన తార్పాలిన్స్ ఆర్ ఎస్ కె లు వద్ద ఉంచాలని అన్నారు. జిల్లాలో రీ సర్వే జరుగుతున్న 30 గ్రామాలు డేటా ఎంట్రీ పూర్తి చేసి వెంటనే సర్టిఫికెట్లు పంపించాలని, భూయజమానులకు కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన ఆటంకాలు ఉండకూడదన్నారు. అందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలన చేసి అర్హులైన వారిని గుర్తించి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. జీవో నెంబర్ 30కు సంబంధించిన భూములను పరిశీలన చేసి పూర్తి వివరాల నివేదికను జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలనకు పంపించాలని ఆర్డీవోలు ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డీటీలు మర్రాపు సన్యాసిరావు, నాగమణి, ఈడీఎం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

విశాలాంధ్ర-టి.నరసాపురం: రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని మధ్యాహ్నపువారి గూడెం సొసైటీ సిఇఓ భుజంగరావు తెలిపారు. మధ్యాహ్నపువారి గూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో 72 వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా భుజంగ రావు గురువారం సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సొసైటీలు అందిస్తున్న సేవలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సొసైటీలు రైతులకు రుణాలు అందించడంతో పాటు పలు రకాల వ్యాపారాలతో రైతులకు మెరుగైన



సేవలను అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

59 మందికి ప్రమోషన్

విశాలాంధ్ర -భీమవరం: పదవ తరగతి ఉత్తీర్ణత చెందిన 59 మంది మిని అంగన్ వాడి కార్యకర్తలను మెయిన్ అంగన్ వాడి కార్యకర్తలుగా అప్ గ్రేడ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలతో నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరి గౌరవ వేతనం రూ.7 వేలు నుండి రూ.11,500 కి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

రాంబాబుపై ఎఫ్ఐఆర్ : వైసీపీ నిరసన

విశాలాంధ్ర- కైకలూరు: ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు, కైకలూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దూలం నాగేశ్వర రావు గురువారం కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు(రాము) పై అక్రమ ఎఫ్ఐఆర్‌ను ఖండిస్తూ, కార్యకర్తలు, నాయకులతో కలిసి కైకలూరు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు.

ముందుగా కార్యకర్తలు నాయకులతో కలిసి కైకలూరు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని, పోలీసు వారు లోపలికి అనుమతించకపోవడంతో, స్టేషన్ ముందు బైఠాయించారు. దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగంశెట్టి రాంబాబు (రాము)పై అభియోగించబడిన ఎఫ్ఐఆర్ కు సరైన కారణం లేదు అని, కార్యకర్తల మీద అబద్ధపు కేసులు పెడితే సహించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడు తోందని, ప్రతీ కార్యకర్తకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

అర్హులందరికీ డిసెంబరులోగా పట్టాలు అందించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.4 పథకంలో భాగంగా పట్టణ పరిధిలో పి.4 దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న బంగారు కుటుంబాలు, మార్గదర్శకులచేత దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా, విద్యా పరంగా, వైద్య అవసరాలు,

ఉపాధి అవసరాలు అందించేలా యాప్‌లో అప్లోడ్ చేయాలని కమిషనరు ఎం. ఏసుబాబు సూచించారు. గురువారం స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో కమిషనరు ఏసుబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. టిడ్కో గృహాలకు సంబంధించి అర్హులందరికీ రిజిస్ట్రేషన్ చేసి డిసెంబర్ లోపు పట్టా అందించాలని సూచించారు. పిజిఆర్ఎస్‌కు సంబంధించి అన్ని కంప్లైంట్లు ఏ రోజుకు ఆ రోజే పరిష్కరించాలని సూచించారు. పురమిత్ర యాప్ ప్రతి ఇంటికి డౌన్లోడ్ చేసి ప్రజలకు పురపాలక సేవలను అందుబాటులో ఉండేలా వారికి అవగాహన కలిగించాలని పురమిత్ర యాప్‌లో వచ్చిన గ్రీవెన్స్ లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ స్పెషల్ ఆఫీసర్ మల్లిఖార్జునరావు, అసిస్టెంట్ కమిషనర్ నగీన సుల్తానా బేగం, ఎమ్. హెచ్. ఓ. డాక్టర్ ఎన్.రాజు, మున్సిపల్ ఇంజనీరు వై. వెంకట రమణ, మేనేజరు యం.రవి సుధాకర్ , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఆర్ ఐ. సి. ఎమ్. ఎమ్. సచివాలయ సెక్రెటరీలు పాల్గొన్నారు.

శ్రీరామవరం వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర - దెందులూరు: దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామ రెవెన్యూ సేవకుడు, వీఆర్ఏ చోడవరపు ఏసు బాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆదేశానుసారం గురువారం వారి కుటుంబాన్ని దెందులూరు

తహసీల్దార్ బత్తుల సుమతి పరామర్శించి, మట్టి ఖర్చుల నిమిత్తం 25,000 రూపాయలు ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందించారు. వీరి వెంట మోతుకూరి నాని, కార్యకర్తలు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆదిత్య, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సేవకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, విద్యార్థులు సద్వినియోగం

చేసుకోవాలని కోరారు. వారం రోజుల పాటు నిర్వహించిన పోటీలలో విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కానిస్టేబుల్ పోస్టుకు సెలెక్ట్ అయిన ముగ్గురికి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 అనిశెట్టి శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ నున్న రమాదేవి, గ్రంథాలయ శాఖ అధికారి రమేష్ బాబు, పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోడౌన్లు తనిఖీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలోని పలు ఎరువుల గోడౌన్లను వ్యవసాయ శాఖ ఏడీఏ పి.బుజ్జిబాబు గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి పోసారావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పరింపూడిలో డీసీఎంఎస్ డిపోను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పొగాకు

పంటకు డీసీఎంఎస్ ద్వారా ఇస్తున్న ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వాస్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేసిన ఎరువులపై ఆరా తీశారు. నాణ్యత కొరకు నాలుగు ఎరువుల నమూనాలను సేకరించాలని పోసారావు కు ఆదేశాలు జారీ చేశారు. ఎరువులన్నీ ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరపాలని, ఎటువంటి వ్యత్యాసాలు గమనించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పచ్చదనం- పరిశుభ్రత పై శిక్షణ

విశాలాంధ్ర-టి.నరసాపురం: గ్రామ పంచాయతీల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడీఓ జి.మణి కుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పచ్చదనం పరిశుభ్రతపై

శిక్షణాకార్యక్రమాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 2030వ సంవత్సరం నాటికి గ్రామ పంచాయతీలన్నీ పచ్చదనం పరిశుభ్రతతో వుండాలనే లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడీఓ జె వి రమణమ్మ, పంచాయతీ రాజ్ ఎఇ సంపత్ కుమారి, ఎపిఎం టి. నాగ భూషణం, టిఓటి శ్రీహరి, వెలుగు సిబ్బంది,ఎస్ హెచ్ జి సభ్యులు, విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : శాఖా గ్రంథాలయం ద్వారకా తిరుమలలో గురువారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీనివాస కాలేజ్ ప్రిన్సిపాల్ దుర్గాదేవి,

ద్వారకా తిరుమల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరళ వాణి , సంస్కృత ఉన్నత పాఠశాల హెచ్.యం. శేషు, సెయిట్ జేవియర్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జీవా, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈనెల 14 నుంచి 20వరకు శాఖా గ్రంథాలయంలో జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బహుమతులను రామాయణం కేశవాచారి స్పాన్సర్ చేశారు. అనంతరం కేశవాచారి ముఖ్య అతిథులకు ఆత్మీయ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ఉన్నత పాఠశాల టీచర్ సుధాకర్, సెయింట్ జేవియర్ స్కూల్ టీచర్స్ యేసు రత్నం, నాగరాజు, గురుకుల పాఠశాల టీచర్ రాధ, న్యూ కీర్తి స్కూల్ టీచర్ రవీంద్ర, గ్రంథాలయ అధికారి యన్.సి.హెచ్.రామకృష్ణ, పాఠకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మేఘలాదేవికి సేవారత్న అవార్డు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం పట్టణానికి చెందిన మెట్ట ప్రాంత మదర్ తెరిసాగా పిలవబడే టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల

మేఘలాదేవికి డాక్టర్ శ్రీ అబ్దుల్ కలాం సేవారత్న అవార్డును కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్ కృష్ణ బాబు గురువారం మేఘాల దేవి నివాసం వద్ద ఆమెకు శాలువా కప్పి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో అనేకమందికి సేవా కార్యక్రమాలు చేసిన మేఘలాదేవికి శ్రీ నటరాజ కులుకు చెక్కభజన కడప వార్తా కమిటీ, ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం అమరావతి వారు ఈ అవార్డును ఆమెకు అందించారని తెలిపారు. మేఘలాదేవికి అబ్దుల్ కలాం అవార్డు రావడంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : జర్నలిస్టులు ఐకమత్యంగా ఉండాలని పలువురు ప్రముఖులు సూచించారు. సమాజానికి మార్గదర్శనం చేసేది జర్నలిస్టులేనని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూ డబ్ల్యూజే) అనుబంధంగా ఉన్న తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ కార్తీక వన సమారాధన కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఐ. జె. యూ. జాతీయ ప్రధాన కార్యదర్శి దూసన పూడి సోమసుందర్ మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం అనేక పోరాటాలు చేశామని అన్నారు. విలువలను పాటించే జర్నలిస్టు లకు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం ఉంటాయని జర్నలిస్టులు అందరూ ఆ దిశగా ముందుకు సాగాలని అన్నారు. స్థానిక కొండాలమ్మ గుడివద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కుంటుంబాలతో కలిసి పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆహ్లాదకరంగాసాగిన ఈ

కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఈత కోట తాతాజీ, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టు నాగేంద్ర,జనసేన పట్టణ అధ్యక్షులు వర్తన పల్లి కాశీ, వైసీపీ పట్టణ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు,మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, టీపీఓ జగదీష్, చెన్న జనార్దన్, సిటికేబుల్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి మురళి, జిల్లా కార్యదర్శి గజపతి ప్రసాద్, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ముగిసిన సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: ఎస్‌టియు (రాష్ట్రోపాధ్యాయ సంఘం) ఆగిరిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం నేటితో ముగిసిందని రెండు రోజుల్లో 200 సభ్యత్వాలు నమోదయ్యా యని ఆ సంఘ ఆగిరిపల్లి మండల అధ్యక్షులు మక్కే వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ కు సంబంధించిన రెమ్యూనరేషన్ ఇంకా చెల్లించలేదన్నారు. వాటిని వెంటనే మంజూరు చేయాలని, మండలంలోని ఉపా ధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, పిఆర్సి కమిటీని వెంటనే నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్టియు సీనియర్ నాయకులు చౌటపల్లి సురేష్ కుమార్, షేక్ అబ్దుల్ హక్, జిల్లా కార్యదర్శి తాడి ప్రసాద్, మండల ఆర్థిక కార్యదర్శి అంకం వెంకటేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు ఆర్. సాంబశివరావు, కె. శ్రీనివాసరావు, టి.కిషోర్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

విశాలాంధ్ర-వీరవాసరం: విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరికీ చదువుతోపాటు సామాజిక అంశా లపై అవగాహన కలిగి ఉండాలని పడాల ఛారిటబుల్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఆకుల మౌనిక తెలిపారు. ప్రపంచ బాలల దినోత్సవాన్ని పడాల చారిటబుల్ ట్రస్ట్ అప్ అసోసియేట్స్ సౌజన్యంతో స్థానిక ఎంఆర్కే జడ్పీహెచ్ స్కూల్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల మౌనిక బృందం విద్యార్థులకు బాలల హక్కులు, బాలలపై జరిగే అత్యాచారాలు, రక్షణ, బాల్య వివాహల వల్ల కలిగే అనర్ధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ టికెవి లక్ష్మీకాంతం, ఐసిడిఎస్ సరోజినీ, ఎంపీటీసీ గులిపల్లి విజయలక్ష్మి, ట్రస్ట్ వలంటీర్లు రొంగల శైలజ, ఇందిర, ఆకుల తార, ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో :మండలంలోని రాయకుదురు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థు లకు హక్కులు, రహదారి భద్రత, వ్యక్తిగత రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిరెడ్డి పుల్లారావు, ట్రస్ట్ వాలంటీర్లు రొంగల శైలజ, ఇందిర, జాస్మిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరపాలక సంస్థ

సీల్డ్ టెండర్ కమ్ పబ్లిక్ ఆక్షన్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 4041/2024/ఎ1 తేది: 11-11-2025

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోగల ఈ దిగువ ఉదహరించిన వివిధ మున్సిపల్ కాంప్లెక్స్ లోని ఖాళీగా ఉన్న షాపు రూములు బహిరంగవేలము కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య **56**, తేది. **05-02-2011** మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య **198**, తేది. **08-05-2012** నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య **76**, తేది.**23-08-2014** ప్రకారము ది.**27-11-2025**, గురువారము ఉదయం గం.**11.00** నుండి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు సీల్డ్ టెండర్ కమ్ ద్వారా పబ్లిక్ ఆక్షన్ నిర్వహించబడును.

అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు:

వంగాయగూడెం చేపల చెట్టు మార్కెట్-8, కందుల సూర్యం కాంప్లెక్స్-FF-1, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు North FF-2, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South GF-1, పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South FF-5, పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాకు South GF-4 క్యాటిల్ డిపో FF-8, మెయిన్ ఫిష్ మార్కెట్-20, గజ్జలవారి చెరువు బుద్ధా పార్క్-22, ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-4,16(SC), చోడిదిబ్బ కాంప్లెక్స్-1, ASR 'C' బ్లాక్ GF-4, న్యూ ఫిష్ మార్కెట్-12, సీల్డ్ టెండర్స్ కోరడమైనది. కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ 1-1, లావేటి అప్పలస్వామి మార్కెట్-1, ప్రకాశం కాంప్లెక్స్ 2, యడ్లబండి స్టాండ్-1, ఆనంద్ కుమార్ క్లాంపెక్స్-1 షాపులను బహిరంగా వేలము నిర్వహించబడును. నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్ణయించిన సాంవత్సరిక అద్దెపై 10 శాతము ధరవత్తుగా చెల్లించవలయును. సాల్వెన్సీ- రూ.1,00,000/-.

గుడ్‌విల్ పద్ధతిపై కేటాయించుటకు:

1. ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-13,, గుడ్ విల్ రూ.25,000/-, 2. లావేటి అప్పల స్వామి మార్కెట్-14, గుడ్ విల్ రూ.25,000/- సాల్వెన్సీ-రూ.1,00,000/- 3. మెయిన్ ఫిష్ మార్కెట్-76 నెంబరునకు గుడ్‌విల్ రూ.1,45,000/-, మెయిన్ ఫిష్ మార్కెట్- 87 (SC) గుడ్‌విల్ రూ.1,00,000/-, సాల్వెన్సీ-రూ.1,50,000/-.

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. సంప్రదించవలసిన **ఫోన్ నెంబర్లు : 7013187783, 9849907144, 9949565630.**

కమీషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు

బ్యాడ్మింటన్ పోటీలో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినికి ద్వితీయ స్థానం

విశాలాంధ్ర- తణుకు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించిందని ఎస్ కే సి డి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భూపతి రాజు హిమ బిందు తెలిపారు. విశాఖపట్నం జిల్లా పరవాడలో ఈనెల 14

15 తేదీల్లో ఐకాన్ స్పోర్ట్స్ హబ్ గేమ్స్ ఫెడరేషన్‌లో వ్యక్తిగత విభాగంలో ఎంపీసీ ప్రథమ సంవత్సర విద్యార్థిని మానే మనోజ్ఞ ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైందని అన్నారు. 2026 జనవరి 2 తేదీ నుంచి ఢిల్లీలో జరగబోయే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కస్పాండెంట్స్ అండ్ సెక్రటరీ సత్య ఉషారాణి విద్యార్థినిని అభినందించారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు క్రీడల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. విజేతను ఫిజికల్ డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

రోడ్డు వేసినందుకు ఫ్లెక్సీతో కృతజ్ఞతలు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నాచుగుంట శివారు కొత్తగూడెం గ్రామానికి రోడ్డు సదుపాయం ఏర్పాటు చేయడంతో మెర్సీ మిషన్ ఫౌండర్ అండ్ డైరెక్టర్, ఉంగుటూరు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ డాక్టర్ ఎ.విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉంగుటూరు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు

చేశారు. గతంలో ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నో విజ్ఞప్తులు సమర్పించారు. రహదారి లేక దీర్ఘకాలంగా విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే ధర్మరాజు సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. శ్రీ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో రూ. 40 లక్షల నిధులు నుండి అర కిలోమీటర్ దూరం వరకు సీసీ రోడ్డు వేశారు. దీంతో సిమెంట్ రోడ్డు పక్కన ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు ఫోటోతో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ బోర్డు గురువారం ఏర్పాటు చేశారు. రహదారి మీదుగా వెళ్లేవారు ఫ్లెక్సీ బోర్డును ఆసక్తిగా చదివి వెళ్తున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీడీవో జి. మణి కుమారి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వ

ర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే సరస్వతీ నిలయాలని అన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా పుస్తక పఠనంపై విద్యార్థులు మొగ్గు చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, పంచాయతీరాజ్ ఎఇ డి.సంపత్ కుమారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.రాజ్ కుమార్, విజన్ స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, ఉపాధ్యాయినిలు జి. విజయలక్ష్మి, కె .మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనం చేయాలి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : గ్రంథాలయాలు భావితరాలకు ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులకు పుస్తక పఠనంపట్ల అభిరుచి కలిగేలా ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు కృషి చేయాలని వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల ఉపాధ్యాయులు వేదుల జనార్ధనరావు పిలుపునిచ్చారు. గురు

వారం జీలుగుమిల్లి శాఖ గ్రంథాలయంలో 58వ గ్రంథాల వారోత్సవాల ముగింపు సభ జరిగింది. వారోత్సవాల్లో వివిధ అంశాలపై జరిగిన పోటీలలో విజేతకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో శాఖ గ్రంథాలయ అధికారి సోది మళ్ల రామలక్ష్మి, కామయ్యపాలెం గ్రంథాలయం వాలంటీర్ మంచినీళ్ల శ్రీనివాసు, జూనియర్ కాలేజీ లెక్చరర్ వి ఆంజనేయులు, ఉపాధ్యాయులు తెల్లం వెంకటేశ్వరరావు , తెల్లం లక్ష్మి, మడకం ఆదిలక్ష్మి, కుమారి. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలతో పోలీసులు స్నేహంగా ఉండాలి

సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్

విశాలాంధ్ర-కడియం : ప్రజలతో పోలీసులు స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండాలని తూర్పుగోదావరి జిల్లా సౌత్ జోన్ డిప్యూటీ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ ఎస్ భవ్య కిషోర్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా కడియం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, మాట్లాడుతూ నమోదు చేసిన కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి తొందరగా చార్జ్ షీట్ ఫైల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్ఐ బి నాగ దుర్గాప్రసాద్, మహిళా ఎస్ఐ పి ధనలక్ష్మి ప్రసన్న, ప్రొఫెషనరీ ఎస్ఐ వై రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పనయే ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అనపర్తి: గ్రామాలలో మౌలిక వసతులు కల్పననే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి మండలం కుతుకులూరులో 41 లక్షలతో నిర్మించిన 8 సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఇవి భాగమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కర్రి శేషారత్నం, కర్రి వెంకటరామారెడ్డి, కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమ తులసి, వైస్ ఎంపీపీ పులగం బలి రెడ్డి, బిసి వెంకటసుబ్బారెడ్డి, కర్రి చెన్నారెడ్డి, సోమరాజు, తిరుమల, అనపర్తి నియోజకవర్గ నాయకులు, అనపర్తి మండల నాయకులు, కుతుకులూరు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర-నల్లజర్ల : నల్లజర్ల మండలం ప్రకాశరావు పాలెం గ్రామ లో ఉన్న వైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలో ఆవపాడు, ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, తెలికచర్ల, సింగరాజుపాలెం గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఐదవ రోజు నల్లజర్లలో సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, క్రెడిట్, డెబిట్ కార్డు క్లోనింగ్ తదతర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాలంటీర్లు ఎ.కె.ఆర్. జి. జూనియర్ కళాశాల విద్యార్థులకు హ్యాకింగ్, ఫిషింగ్, మాల్వేర్, సైబర్ స్టాకింగ్, ఆన్ లైన్ మోసాలపై వివరించారు. అనంతరం వాలంటీర్లు స్థానిక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పరిసర ప్రాంతాలు, మొయిన్ సెంటర్ లోని షాపుల వద్ద ప్రజలకు సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తారో తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో వైజ్ అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు స్వర్ణ పతకం



విశాలాంధ్ర-దేవరపల్లి: అంతర్జాతీయ చదరంగం పోటీలలో దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన గల్ల రాజశేఖర్ స్వర్ణ పతకం సాధించాడు. భూటాన్ రాజధాని దింపులో ఈనెల 14 నుండి 17వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ చదరంగం పోటీలో రాజశేఖర్ స్వర్ణ పథకం సాధించారు. ఈ సందర్భంగా దేవరపల్లిలో గల్ల రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ తనకు చిన్నప్పటినుండి చదరంగం అంటే చాలా ఇష్టమని అన్నారు జిల్లా రాష్ట్ర స్థాయిలో జరిగిన చదరంగం పోటీలలో తాను పాల్గొని ప్రథమ ద్వితీయ స్థానం సాధించానని తెలిపారు. ఇటీవల గోవాలో జరిగిన చదరంగం పోటీలో ద్వితీయ స్థానం సాధించానని ఇదేవిధంగా నెల్లూరులో జరిగిన చదరంగం పోటీలలో వివిధ బహుమతులు సాధించినట్లు రాజశేఖర్ తెలిపారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తిని తన తండ్రి వ్యవసాయం చేస్తూ ఉంటారని పేర్కొన్నారు చదరంగం పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరుపున పాల్గొనటానికి తనకు ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని ఇదేవిధంగా తాను చదరంగం పోటీల్లో పాల్గొనే వారికి శిక్షణ కూడా ఇస్తానని రాజశేఖర్ తెలిపారు అంతర్జాతీయ స్థాయిలో చదరంగం పోటీలలో స్వర్ణ పథకం రాజశేఖర్‌కు రావడంపై దేవరపల్లి మండలంలోని ప్రముఖులు స్నేహితులు అభిమానులు అభినందించారు.

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర-దేవరపల్లి: ఎన్డీఏ ప్రభుత్వం రైతు సంక్షేమానికి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బుధవారం సాయంత్రం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని దీని వలన రాష్ట్రంలో రైతులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. 2024 సంవత్సరంలో రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిందని, ప్రతి రైతును ఆదుకోవాలని ఉద్దేశంతో రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించి మొదటిసారి ఆగస్టు 2న రూ.7వేలు నవంబర్ 19న మరో రూ.7వేలు ప్రతి రైతు ఖాతాలో సొమ్ము జమ చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తుంగభద్ర శ్రీశైలం ధవళేశ్వరం జలాశయాల గేట్లు కూడా బాగు చేయించలేదని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగభద్ర ప్రాజెక్టుకు రూ.55 కోట్లు, శ్రీశైలానికి 200కోట్లు, ధవళేశ్వరానికి 150కోట్లు, ఖర్చు చేసి గేట్లు బాగు చేయించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా రైతులు రసాయనిక ఎరువులను వాడ కాన్ని తగ్గించాలని సేంద్రియ ఎరువులను వాడాలని ఆయన సూచించారు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావటం వలన 65 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడుతు న్నారని ఆయన తెలిపారు. ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డీప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కష్టపడుతున్నారన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా కొనసాగించడానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో రూ.22 కోట్ల నిధులు విడుదలయ్యాయని వాటిని రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వ్యవసాయ అధికారులు చెక్కు అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారులు గోపాలపురం నియోజకవర్గం వ్యవసాయ రంగం అభివృద్ధిపై మాట్లాడారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ మాధవరావు, ప్రకృతి వ్యవసాయ డి ఎం తాతారావు, గోపాలపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి భాగ్యవతి, డీఆర్‌సీఏడీ జయలక్ష్మి దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్, గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ సువర్ణరాజు, కొవ్వూరు ఏడిఏ శ్రీనివాస్, దేవరపల్లి మండల వ్యవసాయ అధికారి కమల, రాజ్‌సోమశేఖర్, దేవరపల్లి గోపాలపురం నల్లజర్ల ద్వారకాతిరుమల మండల వ్యవసాయ శాఖ అధికారులు ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు గన్న మని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజి చౌదరి, ఉప్పులూరి రామారావు, సర్పంచ్ రావి అన్నపూర్ణ, షేక్ మీరా సాహెబ్, ఏలేటి సత్యనారాయణ, రొంగల సత్యనారాయణ, కొయ్యల మూడి చిన్నబాబు, కొయ్యలమూడి సుధారాణి, కోరటూరి శ్రీరామ్మూర్తి, పెనుమత్స సుబ్బరాజు, బిక్కిన నాగరాజు, తాటిన సత్యనారాయణ, దాసరి శేషరావు, గుడిసె శివకృష్ణ, కంబాల సత్తిబాబు, దేవర పల్లి తహసీల్దార్ శ్రీనివాస్, గోపాలపురం నియోజక వర్గంలో నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి నిమ్మల రామానాయుడు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కూటమినాయకులు వ్యవసాయ అధికారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాంసులను పరిశీలించారు. గౌరీపట్నం ధర్మవరం కాలువ మధ్య బ్రిడ్జి నిర్మాణం రోడ్డు ఏర్పాటు కోటి 70 లక్షలు మంజూరు చేయాలని మంత్రి నిమ్మలను కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా తీర్చి దిద్దడమే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పమని డిఆర్‌డిఏ పిడి ఎన్ వి వి ఎస్ మూర్తి అన్నారు కొవ్వూరు పట్టణంలో మండల సమాఖ్య కార్యాలయంలో ఏపియం కె నిర్మల కుమారి ఆధ్వర్యంలో గురువారం కొవ్వూరు మండల వివోఏలు కొవ్వూరు,నల్లజర్ల,దేవరపల్లి, సీతానగరం,పెరవలి , ఐదు మండలాలకు సంబంధించి వెలుగు సిబ్బందికి 2026 - 27 సంవత్సర వార్షిక ప్రణాళిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతి థిగా పిడి ఎన్ వీవీ ఎస్ మూర్తి హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు మంచి గ్రామాలుగా తయారవుటకు ఆరోగ్యం వ్యవసాయం సామాజిక భద్రత అక్షరాస్యత జీవనస్థితిగతులు ఇతర విషయాల గురించి అవగాహన కల్పించారు 2026-27 వార్షిక ప్రణాళిక తయారు చేసుకోవాలని దీనికి ఆర్థిక వనరు మానవ వనరులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి వివోఏ ముగ్గురిని మహిళా పరిశ్రమకు వేత్తలుగా తయారు చేయాలని మహిళల పరిశ్రమ వేత్తగా ఎదగాలని ఆయన అన్నారు. డిపిఎం సంపత్ కుమార్ హాజరై ప్రాజెక్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి 5 మండలాల వెలుగు ప్రాజెక్ట్ సిబ్బంది ఏపీఎం సీసీలు ఎంఎస్ఏలు ఎలేసీ లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు ఎంపీడీవో సిహెచ్ నాగార్జునరావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డ్వాక్రా వివో ఏల క్లీన్ అండ్ గ్రీన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ ఆరోగ్య విషయాలపై శ్రద్ధ వహించాలని కేవలం డబ్బు సంపాదన ముఖ్యం కాదని అన్నారు. రోడ్లపై చెత్తాచెదారంపై గ్రామ పంచాయితీలకు ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన మరింత కల్పించాలని సూచించారు. మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై రాజారావు రిసోర్స్ పర్సన్ హరీష్ మండల పరిషత్ సూపరింటెంట్ జి శాంతి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి సుప్పా ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర-అనపర్తి,పెదపూడి : అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి రాజమహేంద్రవరానికి చెందిన నటరాజనృత్య నికేతన్ సాంస్కృతిక సంస్థ "సుప్పా ఎక్సలెన్స్ అవార్డు-2025" ను ప్రకటించిందని రామ కృష్ణ సేవా సమితి సభ్యులు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమితి అధ్యక్షుడిగా సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పుర స్కారాన్ని అందిస్తున్నట్లు నటరాజ నృత్య నికేతన్ సంస్థ తెలిపింది. అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమితి గత 23 ఏళ్లుగా స్వామి వివేకానంద భావజాలాన్ని యువత, విద్యార్థులకు అందిస్తూ వారిలో చైతన్యాన్ని జాగృతపరుస్తోంది. వ్యక్తిత్వ వికాస సదస్సులు, టాలెంట్ టెస్టు,రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, వివిధ రంగాల ద్వారా సమాజానికి సేవలందిస్తున్న స్ఫూర్తి ప్రదాతలను స్వామి వివేకానంద పురస్కారాలతో సత్కరిస్తూ, సమాజ అవసరాలకు తగినట్లుగా వివిధ సందర్భాలలో సమితి తనపరిధిలో ఆర్థిక చేయూతను అందిస్తోంది. పురస్కారానికి ఎంపికైన పడాల సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అనపర్తి ప్రాంతీయ కోళ్ళ రైతుల సంక్షేమ సంఘం అధ్య క్షుడిగా, కోస్తా ఆంధ్రరెడ్డి సంక్షేమసంఘం గౌరవ అధ్యక్షుడిగా సేవలందిస్తు న్నారు. రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 23న రాజమహేంద్ర వరంలో సంస్థ వ్యవస్థాపకులు, విఖ్యాత నాట్య పండితులు సుప్పా దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ

విశాలాంధ్ర - చాగల్లు : మండల పరిషత్ కార్యాలయంలో గురు వారం మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడి పొడి చెత్త గ్రామపంచాయితీ మిత్రాలకు విడివిడిగా ఇవ్వాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జనపనార సంచులు వినియోగించుకోవాలని, చెత్త సంపద కేంద్రాల వద్ద తయారైన వర్మి కంపోస్ట్ పెరట్లో మొక్కలకు వినియోగించు కొనుట ద్వారా ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో గ్రామ ప్రజలకు వివరం చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, డ్వాక్రా గ్రూప్ మహిళలు, గ్రామ సమాఖ్య మెంబర్స్, మండల స్థాయి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పెద్దాపురం మండలంలో కొండపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యినట్లు పాఠశాల పిఈటి మట్టా సుబ్బారావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ నెల 18వ తేదీన కాకినాడలో జరిగిన ఖో-ఖో, కబడ్డీ పోటీలతో పాఠశాలకు చెందిన శ్రీకాకు ళపు కార్తిక్ (9వ తరగతి) ఖో-ఖో, వాన పల్లి ఉమామహేష్ (9 వతరగతి) అండర్ 14 విభాగంలో కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటిల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మట్టా సుబ్బారావు, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

వాడపల్లి వెంకన్న దేవస్థానానికి భారీ హుండీ ఆదాయం

- 27 రోజులకు రూ.1.59 కోట్లు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా పేరుగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి భారీ హుండీ ఆదాయం సమకూరింది. 27 రోజుల వ్యవధిలో ఆలయ హుండీలు, అన్నప్రసాద హుండీల నుంచి మొత్తం రూ.1,59,44,749 ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వందలాది సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు. హుండీల వారీగా వచ్చిన ఆదాయం ఆలయ హుండీల నుంచి రూ.1,30,38,579, అన్నప్రసాద హుండీల నుంచి రూ.29,06,170, మొత్తం రూ.1,59,44,749. అదనంగా భక్తులు 15 గ్రాముల బంగారం 910 గ్రాముల వెండి 8 దేశాలకు చెందిన 35 విదేశీ కరెన్సీ నోట్లు కానుకగా సమర్పించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా దేవాదాయ శాఖ అధికారి & అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ, జె రామలింగేశ్వరరావు, వైవివి సత్యనారాయణ పర్యవేక్షించారు. అర్చక స్వాములు, సేవకులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం ఫికానా ఫుడ్స్ పూతరేకులు 'సత్యసాయి శతజయంతి మహాప్రసాదం'గాఎంపిక

విశాలాంధ్ర-ఆత్రేయపురం : భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి శతజయంతికి ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహి స్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, ఆత్రేయపురం ప్రసిద్ధ ఫికానా ఫుడ్స్ తయారు చేసే సంప్రదాయ పూతరేకులను మహాప్రసాదంగా ఎంపిక చేశారు. శుద్ధత, నాణ్యత, ప్రేమతో తయారవు తున్న ఆత్రేయపురం పూతరేకులు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ ఎంపికను కల్తీ వ్యతిరేక పోరాటంలో సాధిం చిన ఒక ముఖ్యమైన విజయంగా ఫికానా ఫుడ్స్ (9441024084)వారు భావిస్తున్నారు. ఫికానా ఫుడ్స్ తరపున గాదిరాజు ప్రసాదరాజు మాట్లాడుతూ, "సత్యసాయి శత జయంతి మహోత్సవాల్లో మా ఉత్పత్తి మహాప్రసాదంగా ఎంపిక కావడం మా అదృష్టంమని తెలిపారు.

కాకినాడను క్లీన్-సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతం

విశాలాంధ్ర-కాకినాడ : కాకినాడ నగరాన్ని స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేయడానికి ప్రజలూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిష నర్ కేటీ సుధాకర్ కోరారు. గురువారం ఆయన బాహ్య పర్యటనలో భాగంగా పలు వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బం దికి సూచనలు జారీ చేశారు. పారిశుద్ధ్య పదవ సర్కిల్ మస్తార్ కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు హాజరుకాని పారిశుద్ధ్య కార్మికులపై వెంటనే మెమోలు జారీ చేయాలని సానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకాలతో పాటు జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ ఆదేశాల మేరకు కాకినాడలో పారిశుద్ధ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని మరిన్ని మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. డైరీ ఫార్మ్ సెంటర్లో గల అన్నా క్యాంటీ న్ను పరిశీలించిన కమిషనర్, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్నదాన్ని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి రుచి, నాణ్యత, సేవలపై అభిప్రాయాలు, సూచనలు సేకరించారు. సానిటరీ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, సుదర్శన్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-రాజోలు : మలికిపురం మండలం లక్కవరం గ్రంథాలయం నందు వారం రోజుల నుండి జరుగుచున్న 58వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. లైబ్రేరియన్ సుశీల అధ్యక్షతన జరిగిన సమా వేశంలో ముఖ్య అతిథిగా వచ్చిన లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రుద్రరాజు గోపాల కృష్ణరాజు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానం పెంపొందేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభావంతులు అవ్వాలని ఆయన అన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా వ్యాచారచన, డ్రాయింగ్, ముగ్గుల పోటీలలో విజేతలైన 32 మంది విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రములు అందజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సురేష్ నగర్లో గల జాయ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 3వ తరగతి చదువుతు, అతి తక్కువ సమయంలో "స్కేటింగ్" నేర్చుకొని జాతీయ స్థాయికి ఎంపిక కంకటాల నిహారికను, 4వ తరగతి చదువుతున్న కారే మోక్ష ఆదిత్య 8వ తరగతి చదువుతున్న "కారే రేవంత్" జాతీయ స్థాయి కరాటే పోటీలు (కటాస్)లో ప్రథమ బహుమతి, (కుమిటి)లో ద్వితీయ బహుమతులు గెలుచుకున్న సందర్భంగా గురువారం కాకినాడ కలెక్టరేట్లో కలెక్టర్ను కలిశారు. కలెక్టర్ చిన్నారులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు గెలు పొందిన టోఫీలను జిల్లా కలెక్టర్కు చూపించారు. ఇదే స్ఫూర్తితో పట్టుదలతో భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రతినిధులు గుత్తుల సుశీల, కొవ్వాడ నాగేశ్వరావు, పేరెంట్ అసోసియట్ సాపే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ద్వారా వ్యక్తి వికాసం

విశాలాంధ్ర - సామర్లకోట : పుస్తక పఠనం ద్వారానే వ్యక్తి వికాసం సాధ్యమని తద్వారా సమాజ వికాసం జరుగునని పెదబ్రహ్మదేవం గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని పెదబ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ గురువారం గ్రంథా లయ అధికారి సి మణికుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ విచ్చేసి విద్యార్థులు ఉద్దేశించి గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానవంతులు కావాలని అన్నారు. ఎంపీటీసీ వైవీబి ప్రసాద్‌రావు మాట్లా డుతూ గ్రంథాలయాల ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని విద్యార్థులకు ఉపదేశించారు. పెదబ్రహ్మదేవం శాఖా గ్రంథాల యంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథులచే బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉప్పాడ, కొత్తపల్లి గ్రంథాలయాల్లో నిర్వ హించిన వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్, పైడి రాజు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాలు పాత్ర చాలా ఉందని తెలిపారు. రాజధాని అమరావతిలో డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. కొత్త విషయాలు నేర్చుకోవాలంటే ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలని అన్నారు. మన జీవిత చివర కాల వరకు పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శాస్త్రి, అన్నపూర్ణ, వివిఎస్ ప్రధానోపాధ్యాయుడు మనోజ్, పలు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆవు, దూడ అపహరణ

విశాలాంధ్ర-ఆలమూరు : ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో దారుణం వెలుగుచూసింది. పుంగనూరు ఆవు దూడ చోరీకి పాల్పడ్డారు దుండగులు. అర్ధరాత్రి వేళ ఆవుదూడను ఎత్తు కెళ్లారు. పినపళ్ళ ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి చొప్పెల్లలోని ఆఫీస్ వద్ద పశుపోషణపై మక్కువతో పూర్వం నుంచి ఆవులను, గేదెలను ఇష్టంతో పెంచుతున్నారు. ఈ క్రమంలో ఆవుకు పుట్టిన పుంగనూరు జాతి దూడను ఇటీవల సుమారు రూ.2.50 లక్షలకు అడిగిన ఆయన అమ్మడా నికి నిరాకరించారు. మేలు జాతి పుంగనూరు దూడ ఉందని గ్రహించిన దుండగులు ఆఫీస్ వద్ద సీసీ కెమెరా వైర్లను కట్ చేసి బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు పట్టాభి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

మాజీ మంత్రి సంగిత వియ్యంకుడు మృతి

విశాలాంధ్ర-ఆలమూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్లకు చెందిన మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి వియ్యంకుడు దొడ్డా పుల్లయ్య (90) గురువారం వృద్ధాప్యంతో మృతి చెందారు. సంధిపూడి గ్రామానికి చెందిన పుల్లయ్య ఏకైక కుమారుడు, టిడిపి నాయకుడు సుబ్బారావుకు సంగిత రెండవ కుమార్తె సావిత్రితో వివాహం జరిగింది. రైతుగా పుల్లయ్య ఈ ప్రాంతంలో మంచి గుర్తింపు ఉంది. సంధిపూడి, పినపళ్ల పక్కపక్క గ్రామాలు కావడంతో పుల్లయ్య తరుచుగా సంగిత వెంకట రెడ్డిని కలుస్తూ పుల్లయ్య సన్నిహితంగా ఉండేవారు. ఈయ నకు కుమారుడు సుబ్బారావుతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. పుల్లయ్య మృతికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు తదితర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కాకినాడలో బీపీఎస్‌పై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని అనధికార నిర్మాణాలను బిల్డింగ్ పర్మిషన్ స్కీమ్ (బీపీఎస్) కిందకి తీసుకువచ్చి 2026 మార్చి 12 నాటికి శాతం 100 కవరేజ్ సాధించాలని ఇంచార్జ్ కమిషనర్ కేటి సుధాకర్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో డిసిపి కృష్ణారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలకు చట్టబద్ధ గుర్తింపు అందించేందుకు ప్రభుత్వం బీపీఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందని, అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన సమస్యలు రాకుండా నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, వేగవంతమైన సేవలు, బాధ్యతాయుత వైఖరి పాటించాలని కమిషనర్ ఆదేశించారు. స్కీమ్ వివరాలు, అవసరమైన పత్రాలు, ఫీజు నిర్మాణం వంటి అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వార్డు స్థాయిలో ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, దరఖాస్తులను సమయానికి స్వీకరించి త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన అన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది తమ పరిధిలో ప్రతి భవనాన్ని పరిశీలించి ప్లాన్ లేని నిర్మాణాలను గుర్తించి తప్పనిసరిగా బీపీఎస్ కింద రెగ్యులరైజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. భవిష్యత్తులో అనధికార నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నందున అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంసులభతరం చేసిన బిల్డింగ్ రూల్స్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం పెరిగిందని, బీపీఎస్ అమలుతో నగరపాలన మరింత సుక్రమగా మారడమే కాక నిర్మాణాలకు చట్టబద్ధ గుర్తింపు లభిస్తుందని కమిషనర్ సుధాకర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏసిపి, టిపిఎస్, టిపిబిఓలు, డబ్ల్యూ పిఆర్ఎస్‌లు, కూడాపిఓ, ఏపీవోలు, ఎల్టిపీలు, క్రెడియా, నరేడ్కో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-కరప : జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసాయని గ్రంథాలయ అధికారి పాట్నీడి వెంకటరంగయ్య పేర్కొన్నారు. కరప, వేలంగి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేలంగిలో మెర్ల క్రిష్ణ ప్రసాద్ ఏర్పాటు చేసిన రూ.2వేలు డా. బొండా వెంకన్నారావు విద్యార్థులకు అందించారు. కరపలో పంచాయతీ కార్యదర్శి యు నిర్మలాదేవి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో విద్యార్థులకు జీకే పుస్తకాలు అందించారన్నారు. వేలంగి హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు త్రిమూర్తులు, గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు గ్రంథాలయ ప్రధాన అధికారి కె అశోక్ కుమార్ తెలిపారు. గురువారం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ప్రొ వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ & సైన్సెస్) డా ఎ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గ్రంథాలయాల పట్ల అవగాహన, పఠన సంస్కృతి, జ్ఞాన విస్తరణ పెరుగుతాయని అన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ డా డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నిక్షిప్తమైన ప్రతిభను వెలికితీసే ఈ తరహా కార్యక్రమాలు లైబ్రరీ విభాగం వారు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రంథాలయ ప్రధాన అధికారి కె అశోక్ కుమార్ వివిధ పోటీలలో విజేతల వివరాలు తెలియజేశారు. పుస్తక సమీక్ష పోటీ విజేతలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఏ పద్మా రిషిత, పి హరిహరిచందన, శిలాదిత్య దాస్, కెజిఎల్ భావన, బుక్ హంట్ పోటీలో నిహాల్ పెదిరెడ్డి, బి సూర్య ఉదయ్, స్వాతి రాణి, చిత్రలేఖన పోటీలో రిషిత, ఎంబిఅఖిల రెడ్డి, కె చంద్ర శేఖర్ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ & సైన్సెస్) డా ఎ రమేష్, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా డి కిశోర్, చీఫ్ లైబ్రేరియన్ కె అశోక్ కుమార్, లైబ్రరీ సిబ్బంది ఎ సుజాత, కె వెంకట్, సిహెచ్ వీరాస్వామి, సిహెచ్ భూదేవి, సిహెచ్ స్వామి, ఎస్ గోపి సాయిరామ్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగును తొలగించండి

విశాలాంధ్ర-తాళ్లపూడి: తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామం లో ఎస్సీ ఏరియాలో గల మురుగు నీరు పోయే పెద్ద డ్రైన్ ఉన్నప్పటికీ, మురుగు నీరు పారుదల లేకపోవటం వల్ల దుర్గంధమ్ తో పాటు దోమలు పెరిగి, అనారోగ్యం కల్గించే పరిస్థితులు రోజు రోజుకి పెరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. వేగేశ్వరపురం లో మైన్ రోడ్డు ప్రక్కనే గల ఎస్సీ ఏరియాలో గల అనేక మంది నివాసాలు కు సంభందించి మురుగు అంతా ఈ పెద్ద డ్రైన్ లోనించే బయటకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. పంచాయితీ వారు గతం లో కనీసం మురుగు తొలగించేందుకు మూడు నెలలకి ఓసారి అయినా చర్యలు తీసుకునే వారని, ఇటీవల కాలంలో మురుగు తొలగించిన దాఖలాలు లేవని ఆ ప్రాంత మహిళలు వాపోతున్నారు. మురుగు తొలగింపు కి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: యర్నగూడెం గ్రంథాలయం నందు 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించు కొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఇందిరా గాంధీ యొక్క జీవితం గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఆవిడ చేసిన సంస్కరణలు బ్యాంకుల జాతీయం గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ధనలక్ష్మి ఆయుర్వేద డాక్టర్ విమల రామన్ ముఖ్య అతిథులుగా పాల్గొని అనంతరం గ్రంథాలయకమిటీ తరపున గ్రంథాలయకమిటీ చైర్మనబి ప్రతాప్ వారిని సన్మానించారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి జి అనిత మహిళలు పాఠశాల విద్యార్థులు గ్రంథాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెం శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బొంతా భరత్ బాబు వేణుగోపాల సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స సుబ్బరాజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు గ్రంథాలయాన్ని విద్యార్థులు యువత సద్వినియోగం చేసుకొని విజ్ఞానదాయకంగా ముందుకు కొనసాగాలని సర్పంచ్ భరత్ బాబు అన్నారు. విద్యార్థులకు మహిళలకు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు బొల్లిన విజయ భాస్కర్, జూనియర్ కళాశాల చైర్మన్ గద్దె శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా రామారావు , జనసేన వీర మహిళ పుట్టా జయలక్ష్మి జనసేన నాయకులు బళ్ల రాము , బీజేపీ నాయకులు పుట్టా హరిప్రసాద్, సచివాలయ కార్యదర్శి నాగ్ గ్రంథాలయ అభివృద్ధికమిటీ చైర్మన్ బొడ్డు ప్రతాప్ కుమార్, గ్రంథాలయ అధికారిణి జి అనిత, సింహాద్రి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి



(కెకెడి 20 -11-2025, కెకెడి పిహెచ్ 27 :

విశాలాంధ్ర - ఐ పోలవరం : కోనసీమ రైతుల రబీ వ్యవసాయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్, డ్రైన్, రెవెన్యూ సమన్వయం తో పనిచేయాలని కోనసీమ ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే అన్నారు. గురువారం కలెక్టర్ నేతృత్వంలో జరిగిన కోనసీమ ఇరిగేషన్, డ్రైన్, అడ్వైజరీ కమిటీ బోర్డు సమావేశంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షత వహిస్తూ అధికారు లకుపలుసూచనలు చేశారు. కోనసీమలో డ్రైనేజీ వ్యవస్థను తక్షణమే మెరుగుపరచాలని, వరద నివారణ, నీరు గార్పు సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న క్లోజర్ పిరియడ్లో ఇరిగేషన్, డ్రైనేజ్, రెవెన్యూ శాఖలు రైతులకు ఎటువంటి నష్టం లేకుండా అండగా ఉండా లని కోరారు. స్లూయిస్ గేట్లు, స్ట్రియాజ్ వ్యవస్థ, పాడై పోయిన గేట్లు పాతపడ్డ నిర్మాణాలను ఆధునికరణ చేయాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రవిరాల మహేష్ కుమార్, జిల్లా ఇరిగేషన్, డ్రైన్, రివెన్యూ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

స్తంభానికే విద్యుత్ మీటర్

అమలాపురం పట్టణంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర - అమలాపురం : డబ్బులు ఇస్తే కానిదే లేదంటూ అమలాపురంలో విద్యుత్ శాఖ అధికారులు నిరూపించారు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లు పట్టణంలోని సావరం బైపాస్ సమీపంలో చైతన్య జూనియర్ కాలేజ్ పక్క రోడ్డులో అనుమతుల్లేని ప్రైవేట్ సైటుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన ఘటన. కనెక్షన్ మీటర్ను నేరుగా ప్రభుత్వ విద్యుత్ స్తంభానికి బిగించిన సిబ్బంది. విద్యుత్ శాఖలో అవినీతి, అధికారుల చేతివాటం బహిర్గతమైందని ఘాటుగా విమర్శిస్తున్న స్థానికులు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు విచారణ జరిపి, అక్రమ కనెక్షన్ వెంటనే రద్దు చేయాలని కోరుతున్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఉత్సవాలు

విశాలాంధ్ర-అమలాపురం : ప్రఖ్యాతి గాంచిన అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా ఉత్సవాలను నిర్వహిస్తు న్నట్లు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారా యణరావు తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశం ఆయన మాట్లాడుతూ ఇది కనివిని ఎరుగని చరిత్ర అన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 1000 మంది పూర్వ విద్యార్థులు విచ్చేస్తున్నారన్నారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శనివారం మధ్యాహ్నం విచ్చేస్తున్నారని ఆయన అన్నారు. ఉదయం నుంచి పూర్వపు విద్యార్థుల సమ్మేళనం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు, ముఖ్య ప్రముఖులు తదితరులు హాజరైవుతారని కుడుపూడి అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాద్, బచ్చు ప్రభాకరరావు, షకీలా, ముంగర ప్రసాద్, గుత్తుల సుబ్రహ్మణ్యం, గొవ్వాల నాగరాజు, ఎల్ఐసి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు బాధ్యతగా వ్యవహరించాలి

విశాలాంధ్ర - ఐ పోలవరం : ముమ్మిడివరంనియోజకవర్గంలో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బం దిగా పనిచేసే ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాలనీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల 4687 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముమ్మిడివరం పరిధిలో 9 మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్ గ్రేడ్ చేశారు. ఈ కేంద్రాలకు నియామక కమిటీ సిఫార్సు మేరకు 9 మంది అంగన్వాడీ కార్యకర్తలను నియమించడం జరిగింది. ఈ మేరకు ఐసిడియస్ సిడిపిఒ యం నిహారిక నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త పిల్లలు పట్ల బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.

ముందస్తు ప్రచార కరపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - అమలాపురం రూరల్ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గాను ముందస్తు ప్రణాళికలో భాగంగా ప్రచార కరపత్రికను స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అమలాపురం ప్రిన్సిపాల్ సాధనాల శాంతి రాజశ్రీ కళాశాల ఛాంబర్లో గురువారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతి రాజశ్రీ మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థినులు ఇంజనీరింగ్, నర్సింగ్, డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్షలలో మంచి ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి జేఈఈ, నీట్ మొదలైన పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో చదువుతున్న మొత్తం విద్యార్థినులు అందరికీ టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, ప్రాక్టికల్ రికార్డులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. బోధన తరగతులలో పాటు విద్యలో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మినరల్ వాటర్ ప్లాంట్‌కు విరాళం

విశాలాంధ్ర-గోకవరం: గోకవరం మండలం గుమ్మళ్ళ దొడ్డి గ్రామంలో మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు బుధవారం రూ.20వేలు విరాళం అందజేశారు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు త్రాగునీటి సమస్య ఉందని, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహాయం అందించాలని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావుని గతంలో కోరారు. స్థానిక సీఎండీ కార్యాలయం వద్ద పాఠశాల టీచర్ సిద్దాబత్తుల సునీల్ కుమార్‌కు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు విరాళం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన దొడ్డ శ్రీనివాసరావు, అతని భార్య సత్యవతి అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె వైద్య ఖర్చులు సహాయం చేయాలని, ఆమె భర్త కంబాల శ్రీనివాసరావుని కోరగా స్పందించిన ఆయన రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-అమలాపురం రూరల్ : అమలాపురం రూరల్ పేరూరు గ్రామపంచాయితీ శ్రీరామాంజనేయ నగరపరిధిలో గురువారం కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ" వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమ రచ్చబండ కార్యక్రమం అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయేల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు చెల్లిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్యం, విద్య అందించాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసి పనులు ప్రారంభించారని, వాటిలో కొన్ని నిర్మాణం పూర్తి కాబడి తరగతులు ప్రారంభించారన్నారు. అదేవిధంగా కానీ నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేసి పేద విద్యార్థినీ, విద్యార్థులకు విద్యా వైద్యం అందకుండా చేయడం దారుణమని, దీనిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకునేంత వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేయడం జరిగిందని అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుడుపూడి బాబు, మండల అధ్యక్షులు గుత్తుల చిరంజీవి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు, వైస్ ఎంపిపి పోలమూరి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు సరెళ్ల రామకృష్ణ, ములపర్తి సత్యనారాయణ, ములపర్తి శ్రీను, రాజులపూడి భాస్కరరావు, ఉండ్రు వెంకటేష్, మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకున్న వారికి గత నాలుగు నెలలుగా 7,432 ఎపిక్ కార్డులను పంపడం జరిగిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నూతన నిబంధనల ప్రకారం ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ కు గరిష్టంగా 1,200 ఓటర్లను మాత్రమే కేటాయించవలసి ఉందని, గతంలో గరిష్టంగా1,500 ఓటర్ల వరకు కేటాయించవలసి ఉండేదన్నారు. ఈ నిబంధనను పరిగణలోనికి తీసుకుని జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,461 పోలీస్ స్టేషన్లకు అదనంగా

123 పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే రెండు పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పుకు, ఒక పోలింగ్ స్టేషన్ పేరు మార్పుకు ప్రతిపాదనలను తయారు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం జనవరి ఆరో తేదీ నుండి నవంబర్ 19వ తేదీ వరకు ఫారం-6 కొత్తగా ఓటు పొందటానికి 3,334 మంది దరఖాస్తు చేసుకోగా 2,800 మంది దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. వీటిలో 426 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందని, ఇంకా 108 దరఖాస్తులను పరిశీలించవలసి ఉందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హత కలిగిన యువతను ఓటరుగా నమోదు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) లో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఎన్నికల సెక్షన్ డిప్యూటీ తహసిల్దార్ మద్రాపు సన్యాసిరావు, టిడిపి ప్రతినిధి మరపట్ల శ్యాంబాబు, జె.ఎస్.పి ప్రతినిధి జై శివ, వైయస్సార్ సిపి ప్రతినిధి బి.ధర్మారావు, బి.ఎస్.పి ప్రతినిధి మురాల రత్నరాజు పాల్గొన్నారు.

అమలాపురం అభివృద్ధికి నిధులు ఇవ్వండి

మున్సిపల్ శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఆనందరావు

విశాలాంధ్ర-అమలాపురం : అమలాపురం మున్సిపాలిటీలో డ్రైన్లు, రోడ్లు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. విజయవాడ మంత్రి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన కలిసి అమలాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రావాలని

ఆయనను ఎమ్మెల్యే ఆనందరావు ఆహ్వానించారు. డిసెంబర్ నెలలో తప్పనిసరిగా అమలాపురం వస్తానని నారాయణ హామీ ఇచ్చారు. అమలాపురం పట్టణంలో నిర్మించిన ఈదరపల్లి వంతెనకు అప్రోచ్ రోడ్డు పనులు కుడా ప్రారంభమవుతాయని జనవరి ఒకటో తేదీన రోడ్డు ప్రారంభిస్తామని మంత్రికి వివరించారు. అమలాపురం పట్టణ అభివృద్ధిలో సహకారం కావాలంటూ ఎమ్మెల్యే ఆనందరావు మంత్రి నారాయణను కోరారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలో బంగారం దొంగతనం కేసును 48 గంటల వ్యవధిలో ఛేదించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, తెలిపారు.

గురు వారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కణితి ఆంజనేయప్రసాద్ తాను పనిచేస్తున్న బంగారు నగల తయారీ దుకాణం నుండి యజమాని ఆదేశాల మేరకు నరసాపురంలోని జైన్ గోల్డ్ షాప్‌కు డెలివరీ ఇవ్వడానికి 125 గ్రాముల బంగారు వడ్డాణం, 10 గ్రాములు ఆరు బంగారు లాకెట్లున్న తన ప్యాంట్ జేబులో పెట్టుకుని సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో భీమవరం కొత్త బస్టాండ్‌లో నరసాపురం వెళ్లే బస్సులో ఎక్కడానికి ప్రయత్నిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ బంగారు నగలను చోరీ చేసినట్లు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలో దిగి, సీసీ కెమెరాల ఆధారంగా ఇరువురు నిందితులైన, బంకురు కుమార్, మలుగుమాటి సుభాష్‌లను అదుపులకు తీసుకుని విచారించగా వారి వద్ద నుండి రూ.15 లక్షలు విలువగల మొత్తం 135 గ్రాముల చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్ పంపించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ వి. భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లడ్డు, టిక్కెట్ల విక్రయాల్లో రూ. 48,806 ఆదాయం

విశాలాంధ్ర-పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీర రామ లింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో నందు బుధవారం అభిషేకం టికెట్స్ వగైరాలపై రూ.40, 361 లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా లడ్డు అమ్మకం ద్వారా వచ్చిన రూ.8,445 రూపాయలు ఆదాయం వచ్చిందని. మొత్తంగా వెరసి రూ. 48,806 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు. దేవస్థానం అభివృద్ధికి సహకరిస్తున్న భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

విశాలాంధ్ర-మండవల్లి : ద్విచక్ర వాహనాలు దొంగతనాలు పాల్పడుతున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు సి ఐ రవికుమార్ తెలిపారు. మండవల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం

విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశ పెట్టారు. సెప్టెంబర్ 1న మణుగూరులో మూడు వాహనాలు లోకముడి గరువు వద్ద ఒక వాహనం దొంగతనం గురైందని అప్పట్లో దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎస్ఐ రామచంద్రరావు ఆధ్వర్యంలోని పోలీసులు లోతైన దర్యాప్తు చేసి పల్నాడు ప్రాంతంలో నిందితులైన రామావతు దుర్గ ప్రసాద్,బాణావతి తులసి బాబు, మరో మైనర్ ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును చేదించడంలో ప్రతిభ చూపిన ఎస్సై రామచందర్రావు కానిస్టేబుళ్లు రవీంద్రా,మహేష్, రామకృష్ణ అభినందించారు.

సంక్షేమ పథకాల అమలు చేయండి

10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్య ంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని అడ్డాల వద్ద నిరసన తెలియజేయాలని యూని యన్ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా బుధవారం ఉదయం తెల్ల వారు జాము నుండి కార్మికుల అడ్డాల వద్ద కిషోర్ అధ్యక్షతన బోర్డును అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, నిరసనలు తెలియజేశారు. ఈ నిరసనలకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునప్రారంభించి సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలుచేయాలని, కార్మికుల అడ్డాలు కొండయ్యపాలెం, శాంతి నగర్, గుడారి గుంట, లక్ష్మీ నగర్, భానుగుడి, సర్పవరం, గ్లాస్ హౌస్ సెంటర్ తదితర కార్మి కులు అడ్డాల వద్ద నిరసనలు తెలియజేశారు. కన్స్ట్రక్షన్ రంగంలో వసూలు చేస్తున్న 1 వన్ శాతం సెస్ నిధులను దోచుకోవడం ఆపాలని, 1 శాతం సెస్ నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, పథకాల అమలు చేయాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు పని ప్రదేశాల్లో పనిచేస్తుండగా ప్రమాదాలు జరిగి మృతి చెందిన, పనికి వెళ్లే సమయాల్లో మార్గమధ్యంలో యాక్సిడెంట్లకు గురై మృతి చెందిన కార్మికులకు 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లిస్తున్నారని, సాధారణ మరణానికి రెండు లక్షలు మంజూరు చేస్తున్నారని, అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయాలని, డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్ పథకాలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన అన్నారు. వన్ శాతం సెస్ నిధులు భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదాల కొరకే వసూలు చేస్తున్నారని, ఆ సెస్ నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేసే వరకు బోర్డు ద్వారా పథకాల అమలు చేసే వరకు ఈ కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సోహెల్ ఖాన్, సూరిబాబు, రమేషు, బాలకృష్ణ, వెంకటరమణ, కృష్ణ, గురుమూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సర్కారు తీరని అన్యాయం చేస్తుంది

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీ కరణ ద్వారా పేద ప్రజలకు చంద్రబాబు సర్కారు తీరని అన్యాయం చేస్తోందనీ, దీనిపై ప్రజల

నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని మామిడికుదురు ఎంపీపీ కుసుమ వనజ కుమారి, రాజోలు, మలికిపురం జడ్పీటీసీలు మట్టా శైలజ, బళ్ళ ప్రసన్న కుమారిలు అన్నారు. ఈదరాడలో గురువారం పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నల్లి డేవిడ్ రాజును ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు ఉచ్చుల విష్ణు, కుసుమ పెరుమాళ్ల కుమార్, యెరుబండి సత్యనారాయణమూర్తి. కొల్లాబత్తుల సతీష్, గుర్రం జాషువా, భయ్యా ప్రసాద్, ముస్కూడి నరసింహస్వామి పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీ

సివిల్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఏఐ ప్రాక్టికల్ ట్రైనింగ్

విశాలాంధ్ర - గండేపల్లి : సివిల్ & స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ప్రాక్టికల్ ట్రైనింగ్

కార్యక్రమాన్ని ఆదిత్య యూనివర్సిటీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఐసిఐ కాకినాడ సెంటర్ మరియు ఎసిసిఈ (ఐ) కాకినాడ సెంటర్‌లతో కలిసి నిర్వహిస్తోంది. ప్రారంభ కార్యక్రమం డా ఆర్ అంజలి, డెప్యూటీ హెచ్ఓడి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఆదిత్య యూని వర్సిటీ స్వాగత ప్రసంగంతో ప్రారంభమైంది. అనంతరం డా ఏ రమేష్, ప్రో వైస్-చాన్సలర్, ఈ కార్యక్రమం యొక్క లక్ష్యాలు మరియు ఉపయోగాల గురిం చి వివరించారు. తరువాత ఎస్ దుర్గా ప్రసాద్, చైర్మన్, ఎసిసిఈ (ఐ), ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం డా బి రామమోహన రెడ్డి, హెచ్ఓడి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఆదిత్య యూనివర్సిటీ మొత్తం కార్యక్రమపు రూపురేఖలు మరియు లక్ష్యాలు వివరించారు. ముఖ్య అతిథి డా ఎన్ఎస్ సునీల్ రెవిట్ సాఫ్ట్‌వేర్‌పై ప్రాక్టికల్ ట్రైనింగ్ సెషన్‌ను నిర్వహించారు. మొత్తం కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్, డా ఎస్ గోవిందరాజన్, సమర్థవంతంగా సమన్వయం చేశారు.

రాజశేఖర్‌కు స్వర్ణ పతకం

విశాలాంధ్ర-దేవరపల్లి: భూటాన్‌దేశం థింపూలో ఈనెల 14వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగిన ఎస్బి కేఫ్ 12వ ఇంటర్నేషనల్ క్రీడా పోటీలలో దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన గెల్లా రాజ

శేఖర్ చెస్ పోటీలలో స్వర్ణ పతకం సాధించారు. దేవరపల్లి మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాజశేఖర్ ఇంకా ఎన్నో పోటీలలో విజయం సాధించి దేవరపల్లి మండలానికి మంచి పేరును సంపాదించాలని, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు దున్న సుమన్ బాబు,పచ్చా రాంగోపాల్, మడతల శంకరం, ముప్పిడి భాస్కర్ కుమార్ పల్లికొండ సురేష్ కుమార్, రాపాక అబ్బులు, మల్లిపూడి శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలో పండించిన పంటలు ఆరోగ్యం

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలు ఆర్యోగానికి శ్రేష్టమైనది అని ప్రకృతి వ్యవసాయం గోపాలపురం డివిజన్ మాస్టర్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్ అన్నారు.

దేవరపల్లి మండలం కొత్తగూడెం మండలపరిషత్ ప్రాథామిక పాఠాశాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయం లో పండించిన ఆకుకూరలు కూరగాయలు ను ఆయన గురువారం పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆకుకూరలు కూరగాయలు ఆర్యోగం తో పాటు మంచి పోషాకాలుతో పాటు విటమిన్ లోపం వుండదన్నారు. మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు ఆకుకూరలు కూరగాయలు వంటలు చేసి పెట్టడం చాలా సంతోషదాయకన్నారు. కార్యక్రమంలో మధ్యాహానం భోజనం పథకం నిర్వాకురాలు ప్రగడ నాగమణి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ గంద్రోతు ఏసూకూమారీ, తదితరులు పాల్గన్నారు.